క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



మండలి చైర్మన్‌ను కలిసిన చంద్రమౌళి

దెందులూరు: శాసనమండలి సభాపతి కొయ్యే మోషేన్ రాజును వైఎస్సార్ సీపీ ఇంటిలెక్చువల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఊదరగొండ చంద్ర మౌళి మర్యాదపూర్వకంగా కలిశారు. మోషేను రాజును ఆయన శుక్రవారం అమరావతిలో కలి శారు. సమస్యలను సభాపతి దృష్టికి తీసుకెళ్లామన్నారు.

సీహెచ్‌సీలో మట్టి గుట్టల చదును



భీమడోలు సీహెచ్‌సీలో చదును చేసిన మట్టి గుట్టలు

సాక్షి స్పందన

భీమడోలు: భీమడోలు సీహెచ్‌సీ చుట్టూ అపారిశుద్ధ్యం అనే శీర్షికను సాక్షిలో ప్రచు రించిన కథనానికి సంబం ధిత అధికారులు స్పందించారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణాన్ని మెరక చేసేందుకు వేసిన మట్టి గుట్టలను చదును చేయకుండా వదిలేశారు. దీంతో ఆసుపత్రిలో డ్రెయిన్ సమస్య ఉండడంతో మురుగు నీరు మట్టి గుట్టల వద్దకు చేరింది. బయటకు వెళ్లే మార్గం లేక మురుగు నీరు అక్కడే నిలిచి దుర్వాసన వెదజల్లుతుంది. దీంతో ఆసుపత్రికి వచ్చే రోగులు ఈ వాసనను భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాక్షి కథనానికి స్పందించిన పంచాయతీ అధికారులు మట్టి గుట్టలను చదును చేశారు.

దీక్ష విరమణ



రాంబాబుతో దీక్ష విరమింపజేసిన తహసీల్దార్ సుమతి

దెందులూరు: గోపన్నపాలెంలో గ్రంథాలయం కోసం ఐదు రోజులు దీక్ష చేస్తున్న ఏనుగు రాంబాబు శుక్రవారం దీక్ష నిర్వహించారు. దెందులూరు తహసీల్దార్ బి.సుమతి, ఎస్సై ఆర్.శివాజీ శిబిరం వద్దకు వచ్చి రాంబాబుతో మాట్లాడి గ్రంథాలయ స్థలంపై కోర్టులో స్టే ఉందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా పీపీకి లెటర్ పంపుతామని రాంబాబుకు వివరించారు. రాంబాబు సంతృప్తి చెందడంతో తహసీల్దార్ సుమతి నిమ్మరసాన్ని ఇచ్చి దీక్ష విరమింపజేశారు.

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

దెందులూరు: మహిళలు, బాలికలు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలతో పాటు అన్ని రకాల పరీక్షలు చేయించుకోవాలని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారిని చైతన్య అన్నారు. శుక్రవారం చల్లచింతలపూడిలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహించారు. రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శాంతకుమారి, ఈఎంపీహెచ్ఈఓ ప్రభాకర్, సూపర్‌వైజర్ హెచ్ఎస్ హరి, నాయకులు ముమ్మడి మోహనరావు, నాగన్నబోయిన సత్యనారాయణ, వేమన రాము, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించాలి

భీమడోలు: జీఎస్టీ తగ్గింపుతో నిత్యావసర వస్తువుల ధరలు తగ్గి పేదలకు మేలు జరుగుతుందని ఎంపీడీవో సీహెచ్ పద్మావతీదేవి అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై మండల అధికారులు, సిబ్బందికి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ నుంచి అక్టోబర్ 19వ తేదీ వరకు ఇంటింటికీ వెళ్లి జీఎస్టీ తగ్గింపుతో కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో సుబ్బారావు, ఏవో శర్మ పాల్గొన్నారు.

పీ-4 పటిష్టంగా అమలు చేయాలి

గణపవరం: మండలంలో గుర్తించిన బంగారు కుటుంబాలకు మార్గ దర్శకులను మ్యాప్ చేయడంపై సచివాలయ సిబ్బంది పారదర్శకంగా వ్యవహరించాలని ఎంపీడీవో బీబీ శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది. పంచాయతీ సిబ్బంది, ఇతర ఉద్యోగులకు పీ-4 అమలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవోటీలుగా వ్యవహరించిన డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, రామాంజనేయులు, రవితేజ అవగాహన కల్పించారు.

నారికేళం.. బహు ప్రియం

- రికార్డు స్థాయిలో కొబ్బరి ధరలు
- గత దసరా కంటే రెండింతలు పెరుగుదల
- రిటైల్ మార్కెట్‌లో కాయ రూ.30-50
- హోల్‌సేల్‌లో వెయ్యి కాయల ధర రూ.22 వేలు



కొబ్బరి కాయలు ఒలుస్తున్న కూలీ



రైతుల నుంచి కొనుగోలు చేసిన కొబ్బరి కాయలు



ఎగుమతికి సిద్ధం చేసిన ఒలిచిన కొబ్బరి కాయలు

నిడమర్రు: పెళ్లిళ్లు, పండగలు, గృహ ప్రవేశాలు, శుభకార్యాలు ఇలా కార్యక్రమం ఏదైనా కొమ్మరి కాయ కొట్టాల్సిందే. అలాగే బేకరీలు, హోటళ్లు, స్వీట్ షాపులు, ఇళ్లల్లో నిత్యం కొబ్బరికాలు వినియోగిస్తుంటారు. అయితే గతేడాది వరకూ రిటైల్ మార్కెట్‌లో ఒక కొబ్బరికాయ సైజును బట్టి రూ.15 నుంచి రూ.20 వరకు ధర పలికింది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి కొబ్బరి ధరలు పెరుగుతూ ఒక్కసారిగా రెట్టింపయ్యాయి. ప్రస్తుతం పట్టణాల్లో, పల్లెల్లో కొబ్బరికాయల ధరలు సైజును బట్టి రూ.30 నుంచి రూ.50 వరకు అమ్మకాలు సాగుతున్నాయి. దేవాలయాల వద్ద మరింత ప్రియంగా ఉన్నట్లు భక్తులు చెబుతున్నారు. ప్రస్తుతం శరన్నవరాత్రి ఉత్సవాలు, భవాని, అయ్యప్ప మాలాధారులకు పూజల కోసం కొనుగోలు చేస్తుండటంతో కొబ్బరి గిరాకీ బాగా పెరిగింది. మరో పక్క కొబ్బరి రైతులు గత ఏడాదితో పోల్చితే కొబ్బరి కాయల అమ్మకాలు ధరలు రెట్టింపు అవ్వడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రికార్డు స్థాయిలో ధరలు

కొబ్బరి ధర మునుపెన్నడూ లేని విధంగా రికార్డు స్థాయి ధర పలుకుతోంది. ఏడాది గణాంకాల ప్రకారం మార్కెట్‌లో కొబ్బరి ధర గతం దసరాతో పోల్చితే వందశాతం పెరిగింది. కొబ్బరికి ప్రధాన ఎగుమతి రాష్ట్రాలైన కేరళ, తమిళనాడుల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వలన ఆయా ప్రాంతాల్లో కొబ్బరి కాయల దిగుమతి బాగా తగ్గినట్లు వ్యాపారస్తులు చెబుతున్నారు. ఉత్తరాది మార్కెట్‌లో కేరళ, తమిళనాడు కొబ్బరికి విపరీతమైన డిమాండ్ ఉంది. అయితే దక్షిణాదిన ఈ రెండు రాష్ట్రాల్లో డిమాండ్‌కు తగ్గ దిగుబడులు లేకపోవడంతో ఆంధ్రా కొబ్బరికి డిమాండ్ వచ్చి ధర పెరిగిందని హోల్ సేల్ కొబ్బరి వ్యాపారస్థులు చెబుతున్నారు. ఇక్కడి నుంచి ఎక్కువగా గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, బీహార్, ఢిల్లీ రాష్ట్రాలకు కొబ్బరి ఎగుమతి అవుతుందని ఎగుమతిదారులు చెబుతున్నారు.

రైతుల్లో రెట్టింపైన ఆనందం

మునుపెన్నడూ లేని విధంగా కొబ్బరి ధర పలకడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రైతు వద్ద ఒకప్పుడు వేయి కాయలు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు మాత్రమే ధర పలికేది. గత ఏడాది దసరా రోజుల్లో రైతుల వద్ద నుంచి కాయ ఒక్కింటికి రూ.8 నుంచి రూ.10 కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం అదే కాయలు రూ.18 నుంచి రూ.20 వరకు రైతుల నుంచి హోల్ సేల్ వ్యాపరస్తులు కొనుగోలు చేస్తున్నారు. ధరలు పెరగడంతో రైతులు లాభాల బాట పట్టినట్టైంది. గతంలో పొందిన నష్టాల నుంచి గట్టెక్కడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో ప్రధానంగా మొయ్యేరు గ్రామం నుంచి వల్లూరు, బావాయిపాలెం, జల్లి కొమ్మర గ్రామాల్లో ఎగుమతిదారులు ఉన్నారు. కార్తీక మాసంలో కొబ్బరి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

దక్షిణాదిలో ఎగుమతి తగ్గడంతో డిమాండ్



దక్షిణాది రాష్ట్రాలైన కేరళ, తమిళనాడు నుంచి ఉత్తరాదికి ఎగుమతి తగ్గడంతో ఆంధ్ర కొబ్బరికి డిమాండ్ పెరిగింది. ఈ ఏడాది జనవరి నుంచి కొబ్బరి ధరలు పెరుగుతూ వస్తున్నాయి. ప్రస్తుతం రైతుల వద్ద రూ.18 నుంచి రూ.20కి కొనుగోలు చేస్తున్నాం. హోల్ సేల్‌లో కాయ రూ.22కు మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నాం.

– వీరవల్లి శివ, కొబ్బరి ఎగుమతిదారుడు, మొయ్యేరు

రికార్డు స్థాయిలో ధర పలుకుతోంది



కొంతకాలంగా కొబ్బరిని తెల్లదోమ, కొమ్ముపురుగు సోకడంతో కొబ్బరిరైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుతం దిగుబడి తగ్గినా గత 4 నెలలుగా ధర ఆశాజనకంగా ఉండటంతో కొబ్బరిరైతులకు ఆశించిన స్థాయిలో ధర పలుకుతోంది. మా ప్రాంతంలో ఆక్వా చెరువులు చుట్టూ ఉన్న గట్లపై కొబ్బరి అంతర పంటగా ఉండటంతో పెరిగిన కొబ్బరి ధరలతో రైతులకు ఊరట కలిగింది.

– ముత్యాల బాలాజీ, రైతు, బావాయిపాలెం

ఐలమ్మ స్ఫూర్తితో ముందుకు సాగాలి



ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ఉంగుటూరు: రజకులు ఐలమ్మ ఇచ్చిన స్ఫూర్తితో ఐక్యతతో ముందుకు సాగాలని రజక చైతన్యవ సేవా సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జొన్నాడ శ్రీనివాసు పిలుపునిచ్చారు. గొల్లగూడెం గ్రామంలో రజకుల చెరువు వద్ద ఉన్న ఐలమ్మ విగ్రహం వద్ద జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జొన్నాడ శ్రీనివాసు మాట్లాడుతూ ఉద్యమమే ఊపిరిగా పేదల అభివృద్ధే ధ్యేయంగా ఐలమ్మ కృషి చేశారన్నారు. ఆమె ఆశయ సాధన కోసం రజకులు పని చేయాలని కోరారు. రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ తణుకు పల్లపరావు మాట్లాడుతూ ప్రజా పోరాటాలకు ఐలమ్మ స్ఫూర్తి అని అన్నారు. ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉంగుటూరు మండల అధ్యక్షుడు పిప్పర ప్రసాదు, నల జర్ల మండల అధ్యక్షుడు మడి చర్ల నాగేశ్వరరావు, బోగేల్లి రాంబాబు, అంజూరి శ్రీనివాసు, జొన్నాడ కొండయ్య, కడకట్ల శ్రీనివాసు, వెలుదూటి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

నిడమర్రు: నిడమర్రు సెక్షన్ పరిధిలో కొత్త లైన్ పనుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ అంబేద్కర్ తెలిపారు. నిడమర్రు, గుణపర్రు, విప్పర్తి కండ్రిక, అడవికొలను ఇందిరమ్మ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

వ్యాయామ కళాశాలలో ఆర్చరీ పోటీలు



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ నతానియేలు

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్.నతానియేలు అధ్యక్షతన శుక్రవారం ఆదికవి నన్నయ యూనివర్సిటీ, రాజమహేంద్రవరం పరిధిలోని అంతర్ కళాశాలల మధ్య ఆర్చరీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను పురుషులు, మహిళల విభాగాల్లో నిర్వహించారు. కార్యక్రమానికి టోర్నమెంట్ అబ్జర్వర్‌గా మేరీ సెలినీరోజ్, ఫిజికల్ డైరెక్టర్, సెంట్ థెరిసా కాలేజ్ ఫర్ ఉమెన్, ఏలూరు, సెలెక్షన్ కమిటీ మెంబర్స్‌గా అంజద్ అలీ, ఫిజికల్ డైరెక్టర్, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ చింతలపూడి శ్రీగోపాలకృష్ణ ఆర్చరీ అసోసియేషన్ సెక్రెటరీ, ఈస్ట్ గోదావరి పాల్గొన్నారు. ఈ పోటీల్లో పురుష, మహిళా విభాగాల్లో చింతలపూడి గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ గెలుపొందింది. ఈ పోటీల నుంచి ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో పాల్గొనడానికి టీమ్‌ని సెలక్షన్ చేశారు. కార్యక్రమంలో దిలీప్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.రత్నబాబు, సూపరిండెంట్ పతంజలి జయశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆక్వా మేతలకు రుణాలు



మాట్లాడుతున్న చైర్మన్ సత్యనారాయణ

నిడమర్రు: ఆక్వా రైతులకు చేపలు పెంపకంలో అవసరమైన మేతలకు సంబంధించిన ఖర్చులకు రుణాలు అందిస్తున్నట్లు పెదనిండ్రకొలను సొసైటీ చైర్మన్ కందులపాటి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆ సొసైటీ ఆవరణలో మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఇప్పటి వరకూ ఆక్వా రైతులకు రూ.5.30 కోట్ల రుణాలు సొసైటీ ద్వారా అందించినట్లు తెలిపారు. ఆక్వా రైతులు అవసరమైన రుణాల కోసం సొసైటీని సంప్రదించాలన్నారు. సొసైటీ పరిధిలో 977 మంది సభ్యులు ఉండగా రూ.19 కోట్ల రుణాలు అందించినట్లు తెలిపారు. రైతు బంధు, రైతు నేస్తం వంటి పథకాలు, భీమా పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సభలో సంఘ సభ్యులు బద్దిరెడ్డి వాసు, అల్లూరి గోపాలకృష్ణంరాజు, సీఈవో కేవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిలకమర్తి లక్ష్మీనరసింహం సేవలు ఆదర్శనీయం

భీమడోలు: కళా ప్రపూర్ణ చిలకమర్తి లక్ష్మీనరసింహం సాహితీ రంగానికి చేసిన సేవలు అమోఘమని పలువురు వక్తలు అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో శుక్రవారం చిలకమర్తి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయుడు మండే సుధాకర్ పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో గంథపాలకుడు కె.శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

భీమడోలు: భీమడోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 27వ తేదీ శనివారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తామని ఎంపీడీవో సీహెచ్ పద్మావతీదేవి శుక్రవారం తెలిపారు. ఎంపీపీ కనమాల రామయ్య అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండల పరిధిలోని అధికారులు తమ అభివృద్ధి నివేదికలతో హాజరు కావాలని ఆమె కోరారు. ఈ సమావేశానికి మండల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులు విధిగా హాజరు కావాలని, లేని పక్షంలో వారికి తగు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

కూటమి ఎమ్మెల్యేల వ్యాఖ్యలు అమానుషం



భీమడోలు: సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు



ఉంగుటూరు: సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మరడ మంగరావు

భీమడోలు: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు అమానుషమని, వెంటనే ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రావిపాటి సత్యశ్రీనివాస్ అన్నారు. భీమడోలు సర్పంచ్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఎమ్మెల్యే బాలకృష్ణ అసెంబ్లీ సాక్షిగా చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. బాలకృష్ణ బహిరంగ క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మండల అధ్యక్షుడు రావిపాటి సత్యశ్రీనివాస్, ఉంగుటూరు నియోజకవర్గ వాణిజ్య విభాగం కన్వీనర్ పసుపులేటి సత్యనారాయణ, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సినిమా పరిశ్రమకు పెద్ద పీట వేశారన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు రామకుర్తి నాగేశ్వరరావు, చైతన్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పాము మాన్‌సింగ్, ఎంపీటీసీ ఇంజేటి జూనియర్, బీసీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ తుమ్మగుంట రంగ, పంచాయతీ రాజ్ సెల్ నియోజకవర్గ కన్వీనర్ రామిశెట్టి శ్రీను, ఆర్టీఐ నియోజకవర్గ కన్వీనర్ అంబటి నాగేంద్రప్రసాద్, ఆళ్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణ క్షమాపణ చెప్పాలి

ఉంగుటూరు: సినీ నటుడు, హిందుపురం ఎమ్మెల్యే బాలకృష్ణ అసెంబ్లీలో వైఎస్సార్ సీపీ అధినేత జగన్ మోహనరెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వైఎస్సార్ సీపీ నాయకులు ఖండించారు. శుక్రవారం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మరడ మంగరావు అధ్యక్షతన ఉంగుటూరులో సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం జగన్ మోహనరెడ్డిపై బాలకృష్ణ చేసిన అనుచిత వ్యాఖ్యలు దారుణమన్నారు. ఈ వ్యాఖ్యలను బాలకృష్ణ వెనక్కి తీసుకొని, బహిరంగ క్షమాపణ చెప్పాలని వైఎస్సార్ సీపీ నాయకులు డిమాండ్ చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ బూత్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి యెలిశెట్టి పాపారావుబాబ్జి, రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మంద జయలక్ష్మి, బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెనుగొండ బాలకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు దొంతంశెట్టి సత్యనారాయణ, సయ్యద్ బాజి, బండారు నాగరాజు, పుత్సకాయల విష్ణుమూర్తి, దూసనపూడి లక్ష్మీనారాయణ, సందక రాంబాబు, సందక సాయి, రంగు వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.



దెందులూరు: కార్యక్రమంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వైఎస్ జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు దారుణం

దెందులూరు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కూటమి ఎమ్మెల్యే బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలు దారుణమని వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ ముంగర సంజీవ్ కుమార్, ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ పల్లం ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ముంగర సంజీవ్ కుమార్ నివాసంలో వారు మాట్లాడుతూ అసెంబ్లీలో అభివృద్ధి, ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు ఊసెత్తకుండా సినిమా పరిశ్రమకు సంబంధం లేని కామినేని శ్రీనివాస్ మాట్లాడటం సరికాదని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. కూటమి ఎమ్మెల్యేలు కొల్లేరు గురించి ఏ రోజూ అసెంబ్లీలో మాట్లాడిన దాఖలాలు లేవన్నారు. అసెంబ్లీలో అనుచిత వ్యాఖ్యలు బాధాకరమన్నారు. కూటమి ఎమ్మెల్యేలు భవిష్యత్‌లో ఇటువంటి వ్యాఖ్యలు చేయకుండా చర్యలు తీసుకోవాలని ముంగర సంజీవ్ కుమార్, పళ్లెం ప్రసాద్ డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం



మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి

వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అసెంబ్లీలో కూటమి ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు అత్యంత దురదృష్టకరమని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఇటువంటి ప్రవర్తన కోసమేనా ప్రజలు మీకు ఓట్లు వేసి గెలిపించి అసెంబ్లీకి పంపించిందని ప్రశ్నించారు. బాలకృష్ణ చేసిన ఈ వ్యాఖ్యలను అందరూ ఖండించాలన్నారు. ప్రజా ప్రతినిధులు భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా ఉండాలే తప్ప ఇటువంటి అభ్యంతరకర వ్యాఖ్యలు సహించరాదన్నారు.

మహాలక్ష్మిగా అమ్మవార్ల దర్శనం



భీమడోలు: పండ్లతో అలంకరించిన అమ్మవారు



దెందులూరు: మహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు



ఉంగుటూరు: అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



నిడమర్రు: రజిత కవచంలో దర్శనమిస్తున్న ఉమాదేవి



గణపవరం: ధనలక్ష్మి అవతారంలో వాసవీమాత

భీమడోలు: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఐదో రోజైన శుక్రవారం వైభవోపేతంగా నిర్వహించారు. అమ్మవార్లకు మహిళలు పెద్ద ఎత్తున కుంకుమ పూజలు చేశారు. మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, సూరప్పగూడెం, ఎంఎంపురం, అంబర్‌పేట, కోడూరుపాడు, వడ్లపట్ల, కొల్లేరు గ్రామాల్లో తెల్లవారు జాము నుంచి భక్తులు భవానీ మాతకు విశేష పూజలు చేశారు. భీమడోలు గ్రామంలోని రావిచెట్టు, పోస్టాఫీసు రోడ్డు, భీమడోలు జంక్షన్‌లో ఉత్సవ విగ్రహాల వద్ద భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి దర్శన చేసుకున్నారు. కోలాట భజనలు నిర్వహించారు. గుండుగొలనులో శ్రీభ్రమారాంబికా మల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు ధనలక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రూ.20 లక్షల కరెన్సీతో భక్తులు అమ్మవారిని అలంకరించారు. ఆలయ పూజారుల లంకా శివకుమార్ శర్మ, లంకా శ్రీనివాస్ శర్మల సంయుక్త ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

లక్ష్మీదేవి అలంకరణలో దుర్గామాత

నిడమర్రు: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం దుర్గాదేవి ధన లక్ష్మీ అలంకరణలో దుర్గామాత దర్శనమిచ్చారు. మందలపర్రు గ్రామంలోని ఉమానీలకంఠేశ్వరస్వామి పంచాయితన క్షేత్రంలో వేంచేసియున్న ఉమాదేవి రూ.కోటి కరెన్సీ నోట్లుతో ధనలక్ష్మీ అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా రూ.12లక్షల విలువైన 10 కేజీల వెండితో తయారు చేసిన అమ్మవారి రజిత కవచాన్ని భక్తులు సమర్పించారు. పెదనిండ్రకొలను రామాలయం వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాత వేదికను రూ.2 కోటు కరెన్సీతోనూ, 80 కాసుల బంగారు ఆభరణాలతో అలకరించి ధనలక్ష్మీ పూజలు నిర్వహించారు.

లక్ష్మీదేవిగా అమ్మవారు

దెందులూరు: దసరా మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం గోపన్నపాలెం శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో లక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. గోపన్నపాలెంతో పాటు వీధి గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పోతునూరు, జోగన్నపాలెం, సీతంపేట, కొవ్వలి, శ్రీరామవరం, గంగన్నగూడెం, గాలాయగూడెం అమ్మ వారి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. భక్తులు ప్రసాదాలు స్వీకరించారు.

చల్లాలమ్మ ఆలయం వద్ద చండీ యాగం

ఉంగుటూరు: దేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉంగుటూరు గ్రామ దేవత చల్లాలమ్మ స్కందమాత అవతారంలో ధర్శనమిచ్చారు. ఆలయం వద్ద రెడ్డి చందు ఆధ్వర్యంలో ప్రతి రోజూ చండీయాగం నిర్వహిస్తున్నారు. సింహాచలం నుంచి వచ్చిన వేద పండితులు యాగం నిర్వహిస్తున్నారు. భీమేశ్వరస్వామి ఆలయంలో చైర్మన్ నారాయణం హనుమంతరావు పూజలు నిర్వహించారు. చేబ్రోలు కనకదుర్గమ్మను రూ.11 లక్షల, 11 వేల, 111తో అలంకరించారు. సర్పంచి రందే లక్ష్మీసునీత,రాజు దంపతులు పూజలు నిర్వహించారు.

ధనలక్ష్మి అవతారంలో..

గణపవరం: దసరా నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం అమ్మవారిని ధనలక్ష్మి అవతారంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరి వర్తకసంఘ భవనంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వాసవీమాతను కోటి రూపాయల కరెన్సీ నోట్లతో ధనలక్ష్మి అవతారంలో అలంకరించారు.

ప్రజా ప్రతినిధిగా బాలకృష్ణ అనర్హుడు



నడిపల్లి సోమరాజు

గణపవరం: పవిత్రమైన అసెంబ్లీలో ఎలా ప్రవర్తించాలో తెలియని ఎమ్మెల్యే బాలకృష్ణను తక్షణం సస్పెండ్ చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర పబ్లిసిటీ విభాగం కన్వీనర్ నడింపల్లి సోమరాజు అన్నారు. శుక్రవారం ఆయన ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. బాలకృష్ణ అసహనంతో ఉన్నట్లు తెలుస్తుందని, ఆయన మాట్లాడిన తీరు అసెంబ్లీ గౌరవానికే భంగమని విమర్శించారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి



దరఖాస్తులను అందిస్తున్న వినియోగదారులు

ఉంగుటూరు: విద్యుత్ వినియోగదారుల ఫోరమ్ దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని ఫోరం అధ్యక్షుడు బి.సత్యనారాయణ వెల్లడించారు. శుక్రవారం నారాయణపురం సబ్‌స్టేషన్ వద్ద నిర్వహించిన సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ 939 దరఖాస్తులు రాగా 746 సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. ఎస్.రాజబాబు, ఎస్.సుబ్బారావు, ఎం. మురళీ క్రిష్ణ, ఏఈ కేఎం అంబేత్కర్, డిప్యూటీ ఏఈ పాల్గొన్నారు.